ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శుక్రవారం | 09 అక్టోబరు, 2026 | పేజీలు : 08

## గోదావరి పుష్కరాలకుపకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** గోదావరి పుష్కరాల సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులన్నింటినీ పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానం ఈవో కార్యాలయంలో పుష్కరాల పనుల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.బాసరలో జరుగుతున్న పనుల వివరాలను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధికారి తమ పరిధిలోని పనులను నిరంతరం పర్యవేక్షించాలని, గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు,దుస్తులు మార్చుకునే గదులు, పార్కింగ్ వంటి సౌకర్యాలన్నీ కల్పించాలని ఆదేశించారు. పుష్కరాల నిర్మాణ పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఏవైనా ఉంటే, వెంటనే ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం విశాలమైన పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అలాగే భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఆలయ ఈవో అంజనా దేవి,తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంఆర్ ధాన్యం డీఫాల్టర్ల ఆస్తుల జప్తుకు సిద్ధమవుతున్న సర్కార్

### ఉమ్మడి కరీంనగర్ లో 140 మంది డీఫాల్టర్లు
### టెండర్ ధాన్యం బకాయిల వసూళ్లలో పురోగతి

**ప్రజాపక్షం/కరీంనగర్:** సీఎంఆర్ బకాయిలతోపాటు టెండర్ ధాన్యం డబ్బులు చెల్లించని మిల్లర్ల ఆస్తులను జప్తు చేసేందుకు సర్కార్ సిద్ధమవుతున్న విషయం తెలిసింది. ఈ క్రమంలోనే సివిల్ సప్లై అధికారులు డీఫాల్టర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. సీఎంఆర్ ధాన్యం బకాయిల ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించేలా కార్యాచరణ తయారు చేస్తున్నట్లు సమాచారం. బకాయిలు సకాలంలో చెల్లించని మిల్లర్లకు షోకాజు నోటీసులు ఇచ్చి ఏడు రోజుల్లోగా స్పందించక పోతే వారి ఆస్తులు జప్తు చేసి వేలం ద్వారా అమ్మివేయనున్నట్లు తెలిసింది. నిర్ణీత గడువులోగా సమాధానం ఇవ్వని మిల్లర్ల బకాయిల రికవరీలో భాగంగా రైస్ మిల్లులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేసి వీటి ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన మొత్తం బకాయిలు రికవరీ కాకపోతే మిల్లర్లకు చెందిన స్థిరాస్తులు, వాహనాలు తదితరాలను జప్తుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు చర్యలన్ని చట్టబద్ధంగా, ఆధారాలతో చేపట్టేలా ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 150 మంది మిల్లర్లు డీఫాల్టర్లుగా తేలినట్లు తెలిసింది. 2014 నుంచి 2024 వరకు కరీంనగర్ జిల్లాలో 40 మిల్లుల నుంచి రూ.180 కోట్లు బకాయిలు పెండింగ్ లో ఉన్నాయి. అలాగే జగిత్యాల జిల్లాలో 30 రైస్ మిల్లుల నుంచి రూ.230 కోట్లు, పెద్దపల్లి జిల్లాలో 38 మిల్లుల నుంచి సుమారు రూ.238 కోట్లు రావాల్సి ఉంది. సిరిసిల్ల జిల్లాలో 42 మిల్లుల నుంచి రూ.222 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొత్తంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 140 మంది మిల్లర్లకు పైగా డీఫాల్టర్లు తేలగా.. వారి నుంచి రూ.750 కోట్లకు పైగా వసూలు కావాల్సి ఉన్నట్లు తెలిసింది.

### టెండర్ ధాన్యం బకాయిలు రూ.89.54 కోట్లు వసూలు..

కరీంనగర్ జిల్లాలో టెండర్ ధాన్యానికి సంబంధించి రూ.125 కోట్లు వసూలు కావాల్సి ఉండగా..ఈ నెల 3వరకు రూ.89.54 కోట్లను మిల్లర్లు చెల్లించారు. రూ.35 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అత్యధికంగా శ్రీనిధి ట్రేడర్స్ (మానకొండూరు) రూ. 5.74 కోట్లు, వరుణ్ ఇండస్ట్రీస్ (హుజూరాబాద్) రూ. 5.58 కోట్లు, శ్రీ శ్వేత ఆగ్రో ఇండస్ట్రీస్ (చొప్పదండి) రూ. 5.46 కోట్లు బకాయి ఉన్నాయి. వీటితోపాటు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్(గోపాల్‌పూర్), సౌజన్య ఆగ్రో ఇండస్ట్రీస్(ఆర్నకొండ), శ్రీ లక్ష్మి వెంకటరమణ ఇండస్ట్రీస్( బోర్నపల్లి), సప్తగిరి ఇండస్ట్రీస్( జమ్మికుంట), శ్రీ రాజరాజేశ్వర పీబీఆర్ఎం(తాడికల్), శ్రీ శ్రీదేవి ఇండస్ట్రీస్(జమ్మికుంట), లక్ష్మి ఎంఆర్ఎం–(మొలంగూర్), ఎస్.ఆర్ ట్రేడర్స్(రంగాపూర్), అరుణోదయ ఆగ్రో ఇండస్ట్రీస్(శాయంపేట), ధనలక్ష్మి ఇండస్ట్రీస్( బొమ్మకల్), విజయలక్ష్మి ఇండస్ట్రీస్(అలుగనూర్) ఉన్నాయి. వీటి నుంచి రూ.10 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు రావాల్సి ఉంది.

### రూ.35 కోట్లు చెల్లించిన ఒకే యాజమాన్యం..

టెండర్ ధాన్యం బకాయిల వసూళ్లలో పురోగతి ఉంది. ఇందులో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శశికిరణ్ కు చెందిన చెందిన మిల్లులైన తిమ్మాపూర్ మండలం రేణికుంటలోని ఆర్కే ఇండస్ట్రీస్, సాయిశ్రీనివాస ఇండస్ట్రీస్, మానకొండూరులోని వీరభద్ర ఇండస్ట్రీస్, సిద్ధి వినాయక ఇండస్ట్రీస్ నుంచి రూ.35 కోట్లు రెండు నెలల క్రితమే వసూలయ్యాయి. తిమ్మాపూర్ లోని వెంకటేశ్వర ఇండస్ట్రీస్, మానకొండూరులోని మానస, హనుమాన్ ఇండస్ట్రీస్ తదితర 35 మిల్లుల నుంచి బకాయిలు పూర్తిగా వసూలయ్యాయి.

## క్షేత్రస్థాయిలో వివరాలు కచ్చితంగా నమోదు చేయాలి



కలెక్టర్ గరిమ అగ్రవాల్

### భూముల రీసర్వేపై రెవెన్యూ, సర్వే శాఖ అధికారులకు శిక్షణ

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో భూముల రీ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలు ఖచ్చితత్వంతో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూభారతి కింద భూముల రీ సర్వే ప్రక్రియపై జిల్లాలోని డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, జీపీఓలు, సర్వేయర్లకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా భూభారతి కింద భూముల రీ సర్వే ఉద్దేశం, ఉపయోగాలు, పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. భూముల రీ సర్వే కోసం జిల్లాలో మొత్తం 18 రోవర్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సర్వే కోసం ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించిందని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా వారు విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. భూముల రీ సర్వే రెవెన్యూ ఉద్దేశం, ప్రయోజనాలు, మొత్తం ప్రక్రియ తదితర అంశాలపై గ్రామస్థులకు వివరించాలని సూచించారు. ఏ ఏ భూముల్లో సర్వే చేస్తారో వాటి వివరాలను ముందుగానే చేరవేయాలని తెలిపారు. జీపీఓ, పంచాయతీ కార్యదర్శి సైతం సర్వేలో ఉండాలని వెల్లడించారు. ముందుగా గ్రామ సరిహద్దు సర్వే చేయాలని రెవెన్యూ, నీటి పారుదల శాఖ, అటవీ శాఖ తదితర శాఖల అధికారులకు సమాచారం అందజేసి వారు సైతం సర్వేలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని స్పష్టం చేశారు.ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## గన్నేరువరంలో సిపిఐ నాయకులు ధర్నా

### అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలి



**ప్రజాపక్షం/గన్నేరువరం :** మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను తక్షణమే అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసి

తరువాయి 2 లో...

## ఓటర్ల రక్షణే లక్ష్యంగా ఆర్‌డిఓ ఆఫీస్ ఎదుట నిరాహార దీక్ష

### జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి కాంగ్రెస్ డిమాండ్

**ప్రజాపక్షం/నిర్మల్ :** ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ (సర్) పేరిట జరుగుతున్న అక్రమాలు, అవకతవకలను నిరసిస్తూ, ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును పరిరక్షించేందుకు ఇండియా కూటమి చేపట్టిన సేవ్ డెమోక్రసీ పిలుపులో భాగంగా నిర్మల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ డే నిరసన,నిరాహార దీక్ష నిర్వహించింది.ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పిలుపుతో,నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ కూచడి శ్రీహరి రావు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట గురువారం ఈ కార్యక్రమం



చేపట్టారు. ఎన్నికల వ్యవస్థ పట్ల ప్రజల్లో పూర్తి నమ్మకం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘానిదేనని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న

తరువాయి 2 లో...

## విద్యా వలంటీర్లకు వేతనాలు అందజేత



ప్రజాపక్షం/మల్లాపూర్ : మండలంలోని కొత్తదామరాజు పల్లి ప్రైమరీ పాఠశాలలో పని చేస్తున్న విద్యా వాలంటీర్లకు వీడీసీ ఆధ్వర్యంలో 50 వేల రూపాయల వేతనాలను గ్రామ సర్పంచ్ ఎగ్యరపులింబాద్రి అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేసి బోధిస్తుండడం అభినందనీయమని సర్పంచ్ అన్నారు. ఉప సర్పంచ్ బద్దం హరీష్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి వంశీధర్ రెడ్డి,గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణ భూమేశ్,రాజేందర్,రవి, తిరుపతి ఉన్నారు.

## మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా రాజు

ప్రజాపక్షం /మల్లాపూర్ : మొగిలిపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన తోకల రాజు బుధవారం ఎన్నికయ్యారు.ఈ మేరకు మత్స్య సహకార శాఖ సహాయ రిజిస్ట్రర్ అనూష ఆధ్వర్యంలో మత్స్య సహకార సంఘంపాలక వర్గ ఎన్నిక నిర్వహించగా అధ్యక్షుడిగా తోకల రాజు,ఉపాధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్,కార్యదర్శిగా బొల్లి నరసయ్య ఎన్నికయ్యారు.అదేవిధంగా కార్యవర్గ సభ్యులను సైతం ఎన్నుకున్నారు. కాగా ఎన్నికలలో ఏలాంటి ఆవాచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు మధ్య జరపడం విశేషం. తనపై నమ్మకం ఉంచి తన ఎన్నికకు సహకరించిన సంఘ సభ్యులకు రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కోడి పందాల స్థావరంపై పోలీసుల దాడి

### నగదు, వాహనాలు స్వాధీనం

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల పరిధిలోని లక్ష్మీ పూర్ గ్రామంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ఎం. కృష్ణసాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మీపూర్ గ్రామ పరిధిలో కొందరు వ్యక్తులు గుంపులుగా చేరి కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది.ఈ సమాచారం మేరకు ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.అక్కడ సుమారు 8 మందికి పైగా వ్యక్తులు గుంపుగా చేరి కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు . పోలీసుల రాకను గమనించిన పందెం రాయుళ్లు అక్కడి నుంచి పారిపోయారు.ఈ దాడిలో సంఘటనా స్థలం నుండి ఒక పందెం కోడి,4 ద్విచక్ర వాహనాలు,5 సెల్‌ఫోన్లు , రూ. 2,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వస్తువులను గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి, పందాలు నిర్వహిస్తున్న నిందితులపై చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎవరైనా కోడి పందాలు,పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇలాంటి ఉల్లంఘనలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# ఎస్సీ బాలుర వసతిగృహంలో కలెక్టర్ తనిఖీ

ప్రజాపక్షం/కరీంనగర్: విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యతను తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్వయంగా వంటగదిలోకి వెళ్లారు. కరీంనగర్‌లోని కార్ఖానాగడ్డ ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహాన్ని గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె.. హాస్టల్‌లోని సౌకర్యాలను పరిశీలించడంతో పాటు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వసతిగృహంలోని గదులు, పరిసరాలు, వంటగది, ఇతర సౌకర్యాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వంటగదిలో భోజనం తయారవుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. కూర వండుతున్న సమయంలో గరిటె పట్టుకుని కలియబెట్టడం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. భోజనం నాణ్యత, వంటకు ఉపయోగిస్తున్న పదార్థాలు, పరిశుభ్రత తదితర అంశాలను వంట సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భోజనం విషయంలో నాణ్యతతో రాజీ పడకూడదని సూచించారు. వంటగది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు.హాస్టల్‌లోని విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. భోజనం, తాగునీరు, వసతి, ఇతర సౌకర్యాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. హాస్టల్ భవనం పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్.. అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు విద్యార్థులను ప్రత్యామ్నాయ వసతి గృహానికి తరలించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వంట సిబ్బందితో కూడా కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ నిర్వహణకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ తనిఖీలో సోషల్ వెల్ఫేర్ డీడీ భాగ్యలక్ష్మి, ఏఎస్‌డబ్ల్యూఓ తిరుపతినాయక్, ఎస్‌డబ్ల్యూఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

ప్రజా పక్షం/బీర్‌పూర్ : జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని గొందిగూడెంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలికలు)లో ముందస్తు బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని విద్యార్థినులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులతో ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.విద్యార్థినులు బతుకమ్మ చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ,కోలాటాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.పాఠశాల ప్రాంగణం బతుకమ్మ పాటలతో,విద్యార్థినుల ఉత్సాహంతో పండుగ వాతావరణాన్ని తలపించింది.ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, పూల పండుగ అయిన బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,ప్రకృతి ప్రేమకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో మన సంస్కృతి,సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు,ఐక్యత,సోదర భావం మరియు సామూహిక స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థినులతో బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి,సంప్రదాయాలను తెలుసుకొని వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.వేడుకల అనంతరం విద్యార్థినులు,ఉపాధ్యాయులు మరియు గ్రామ ప్రజలు పరస్పరం బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ శేఖర్, గ్రామ సర్పంచ్ పురుక దీపకల్పనారాంచందర్,ఉప సర్పంచ్ సీతారాం,గ్రామ ఆదివాసీ నాయకులు,ఉపాధ్యాయులు బిజిలి రవీందర్,సమ్మక్క,భీమసేన,శిరీష,కవిత,లావణ్య,గ్రామ ప్రజలు, విద్యార్థినులు,తదితరులు పాల్గొన్నారు.



## సబ్ స్టేషన్‌లో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్, సర్క్యూట్ బ్రేకర్ ప్రారంభం

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి సబ్ డివిజన్ పరిధిలోని చిల్వాకోడూర్ సెక్షన్‌లో ఉన్న శేకల్ల సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 1x5 ఎం వి ఏ(మెగా వోల్ట్‌ఆంపియర్ ) పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పి టి ఆర్ ),11 కేవీ సర్క్యూట్ బ్రేకర్‌ను గురువారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టీ జీ ఎన్ పి డి సి ఎల్ జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ ఈ ) భోంకూరి సుదర్శన,జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ (డి ఈ ) కొత్తూరి గంగారాం,ఎం ఆర్ టి అండ్ కన్స్ట్రక్షన్స్ డి ఈ జి.శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి నూతన విద్యుత్ పరికరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. శేకల్ల సబ్ స్టేషన్ పరిధిలో కొత్తగా 1x5 మెగా వోల్ట్ ఆంపియర్ పవర్ ట్రాన్స్ ఫార్మర్, 11 కేవీ సర్క్యూట్ బ్రేకర్ అందుబాటులోకి రావడం వల్ల విద్యుత్ సరఫరా సామర్థ్యం, నాణ్యత మరింత మెరుగుపడుతుందన్నారు. భవిష్యత్తులో లోవోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా, వినియోగదారులకు మరియు రైతులకు ఎలాంటి అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరాను అందించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గొల్లపల్లి విద్యుత్ శాఖ,ఏ డి ఈ పి.వరుణ్ కుమార్,ఎం ఆర్ టి .ఏ.డి ఈ లు,వివిధ సెక్షన్ల ఏ ఈ లు, విద్యుత్ శాఖ సిబ్బంది,లైన్‌మెన్లు ,స్థానిక ప్రజలు, పాల్గొన్నారు.



## రక్తదానంతో సేవాభావాన్ని చాటిన బిజెపి కార్యకర్తలు

ప్రజాపక్షం/ధర్మపురి : ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా జీవితాన్ని పూర్తిచేసుకున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు దామెర రామ్ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా దామెర రామ్ సుధాకర్‌రావు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న ఎంతో మంది రోగులకు, వారి కుటుంబాలకు అండగా నిలవవచ్చన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ధర్మపురి నియోజకవర్గంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు.బీజేపీ నాయకులు,కార్యకర్తలు నిస్వార్థంగా ప్రజాసేవలో ముందుంటారని పేర్కొంటూ రక్తదానం చేసిన కార్యకర్తలను అభినందించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల రక్షణే లక్ష్యంగా ఆర్‌డిఓ ఆఫీస్ ఎదుట నిరాహార దీక్ష

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతియుత మార్గంలో నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, అగ్రనేత ప్రియాంక గాంధీలతో పాటు ఇండియా కూటమి ఎంపీలను కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రశ్నించే గొంతులను నొక్కేయడం అప్రజాస్వామికమని,ఈ చర్యలకు ప్రధాని నరేంద్ర మోడీ,హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే ప్రజల అసలైన శక్తి అని, ప్రజల ఓటు హక్కు, రాజ్యాంగ విలువల రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ నిరసన దీక్షా కార్యక్రమంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, నిర్మల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల హరీష్ కుమార్,పలువురు కౌన్సిలర్లు,సర్పంచ్‌లు,మండల అధ్యక్షులు మరియు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గన్నేరువరంలో సిపిఐ నాయకులు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పూర్తి చేసి మండలవ్యాప్తంగా ఉన్న అర్హులను గుర్తించి వారికి అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్టర్ నాసిరకం మెటీరియల్ వాడడం వల్ల నిర్మించిన ఇండ్లు ప్రారంభానికి ముందే కూలిపోయే స్థితికి చేరాయని లక్షలాది రూపాయల ప్రజాధనం వృధా అయినా సంబంధిత కాంట్రాక్టర్‌పై ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అధికార పార్టీ నేతలు స్వపక్ష పాతంతో వ్యవహరిస్తున్నారని వారి అనుచరులకే ఇండ్లను కట్టబెడుతున్నారని ఆరోపించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మహ్మద్ రఫీకి అందజేశారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతాల అంజిరెడ్డి, మండలకార్యదర్శి చొక్కాల శ్రీశైలం, సహాయ కార్యదర్శులు కూన మల్లయ్య, పిప్పల కనుకయ్య, గ్రామ కార్యదర్శులు బోయిని తిరుపతి, బోయిని మల్లయ్య, గాజుల లక్ష్మణ్, ఆంజనేయులు, మండల నాయకులు ఎండి నయీమ్, యువజన నాయకులు మొలుగురి ఆంజనేయులు, బిట్ల శ్రీనివాస్, శంకర్, జలపతి, సంబు తిరుపతి, పంబాల ఆంజనేయులు, బుట్ల భాస్కర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీరందించాలి

ప్రజాపక్షం/మల్లాపూర్ : చేతికొచ్చే దశలో పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయని తక్షణమే ఎస్సారెస్పీ ప్రాజెక్టులోని నీటిని వదిలి రైతులను ఆదుకోవాలని బీసీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ బోయిని హన్మండ్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.గురువారం రోజున విలేకరులతో మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గం మల్లాపూర్ మండలంలోని చివరి ఆయకట్టు గ్రామాలలో పంట పొలాలు ఎండిపోతున్నాయని,ప్రభుత్వం ప్రాజెక్టులోని నీరు వదలక పోతే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో పంట పొలాలు కాకుండా చెరువులు కుంటలు బావుల్లో నీరు తగ్గిపోయి పశువులకు తాగునీరు కూడా కరువైందని ప్రభుత్వం దిగివచ్చి రైతులకు నిరందించి ఆదుకోవాలని,లేని యెడల రైతులతో రోడ్డు ఎక్కుతామని హెచ్చరించారు.

## రత్నాపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాపక్షం /మల్లాపూర్ : మండలంలోని రత్నాపూర్ గ్రామానికి పూర్తిస్థాయిలో బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నామని గ్రామ సర్పంచ్ గొండ రాజేందర్ అన్నారు.ఈ మేరకు గురువారం డిపో మేనేజర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రత్నాపూర్ గ్రామస్తులు, వృద్ధులు బడి పిల్లలు గర్భిణీ స్త్రీలు కుస్తాపూర్ వెళ్లి బస్సు ఎక్కే పరిస్థితి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి గ్రామస్తుల ఇబ్బందులను తొలగించాలని ఆర్టీసీ అధికారులను కోరినట్లు గ్రామ సర్పంచ్ రాజేందర్ తెలిపారు. కలిసిన వారిలో సర్పంచ్ రాజేందర్ మాజీ ఎంపీపీ నల్ల రాజన్న,గ్రామస్తులు ఉన్నారు.



## సిసి కెమెరాలకు రూ.80 వేల విరాళం

### సింగరేణి ఆర్జీ3 సివిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్

ప్రజాపక్షం/రామగిరి : రామగిరి మండలం నేరాల నియంత్రణ,ప్రజల భద్రతలో కీలకంగా మారిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను రామగిరిలో మరింత బలోపేతం చేసేందుకు సింగరేణి ఆర్జీ 3 ఏరియా సివిల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ రూ.80 వేల విరాళం అందజేసింది.ఈ మొత్తంతో పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేయని పాత సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు గురువారం రూ.80 వేల మొత్తాన్ని రామగిరి ఎస్ఐ తాడవేని.ప్రమాదాలు,ఇతర ఘటనలు జరిగినప్పుడు కెమెరా ఫుటేజీ కీలక ఆధారంగా ఉపయోగపడుతుంది. నేరస్తులను గుర్తించడం,కేసుల దర్యాప్తులో ఆధారాలను సేకరించడం,ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం వంటి అంశాల్లో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషించనున్నాయి.

## ఆర్జి-3,ఎపిఎ ఏరియాలో కార్పొరేట్ టార్గెట్ కమిటీ పర్యటన

ప్రజాపక్షం/రామగిరి : రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గురువారం కార్పొరేట్ టార్గెట్ కమిటీ పర్యటించింది. పర్యటనలో భాగంగా కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ విభాగం జనరల్ మేనేజర్, కమిటీ కన్వీనర్ జి.దేవేందర్, ఉపరితల గనుల విభాగం జనరల్ మేనేజర్ పి.ఎలీషా,భూగర్భ గనుల విభాగం జనరల్ మేనేజర్ కె.యాదయ్య, ఐ అండ్ పి ఎం విభాగం జనరల్ మేనేజర్ యం.వి.నరసింహారావు,ఐఈ విభాగం ఏజిఎం సిహెచ్.వెంకయ్య,రామగుండం రీజియన్ నాణ్యత విభాగం జనరల్ మేనేజర్ జె. వెంకట రమణ లతో పాటు ఇతర కమిటీ సభ్యులు జీఎం కార్యాలయం నందు రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వర రావులతో పాటు ఏరియా లోని వివిధ గనుల,విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం లో 202728 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించాల్సిన లక్ష్యం,ప్రణాళికలు, బొగ్గు ఉత్పత్తి, రవాణా ఓ.బి (మట్టి వెలికితీత) మొదలగు అంశాలపై చర్చించారు.అదేవిధంగా 202728 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయా భూగర్భ,ఉపరితల గనులకు కావలసిన యంత్రాలు, యంత్ర సామాగ్రి, పనిముట్లు, సదుపాయాలు అంశాలపై చర్చించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేయాలని, భద్రత తో ఉత్పత్తిని సాధిస్తూ సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఎస్వోటుజిఎంలు ఎం.రామ్మోహన్, బండి సత్యనారాయణ, ఏరియా ఇంజినీర్లు ఎ.ఉదయ భాస్కర్,దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జి.రాజశేఖర్, కె.జనార్దన్, ప్రాజెక్ట్ ఇంజినీర్లు జ్ఞాన సంబంధన్, ప్రకాష్, మేనేజర్లు రావుల పాపయ్య,భరత్ కుమార్,కార్పొరేట్ కమిటీ సభ్యులు సిహెచ్. గాబ్రియల్ రాజు,రామక్రిష్ణ,గంగాధర్, వివిధ గనుల,విభాగాల అధిపతులు,అధికారులు,కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.



# నిత్యం ప్రజల చెంతనే ముత్తారం సర్పంచ్!



ప్రజాపక్షం/ముత్తారం : ఆయన పదవిలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల కోసమే ఆలోచిస్తారు.. గ్రామంలో ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ ముందుంటారు.. ఆయనే పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రం సర్పంచ్ సుధాటి రవీందర్ రావు. గతంలో ఒకసారి ఎంపీటీసీగా,అంతకుముందు సామాన్య నాయకుడిగా, ప్రస్తుతం సర్పంచ్‌గా ఆయన అందిస్తున్న సేవలు ముత్తారం మండల కేంద్రంలోని ప్రజలచే 'శభాష్ రవీందర్ అన్న' అనిపించుకుంటున్నాయి.ప్రజా ఆదరణే శ్వాసగా, గ్రామాభివృద్ధే ధ్యేయంగా దూసుకుపోతున్న రవీందర్ రావుతో ప్రజా పక్షం ప్రత్యేక ముఖాముఖి కథనం. నాయకుడిగా రవీందర్ రావు ప్రస్థానం నిరంతరం ప్రజలతో ముడిపడి ఉంది. గతంలో ఎంపీటీసీగా పనిచేసిన కాలంలోనే కాకుండా, అంతకు ముందు కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. ఆ నమ్మకంతోనే ముత్తారం ప్రజలు ఆయనను సర్పంచ్‌గా గెలిపించుకున్నారు. నాటి నుండి నేటి వరకు తన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా పక్షపాతిగా నిలిచారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గ్రామంలో నెలకొన్న ఎన్నో ఏళ్ల నాటి సమస్యలను ఆయన పరిష్కరిస్తూ వస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన రక్షిత మంచినీరు అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దెబ్బతిన్న అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయించి,ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరిచారు. గ్రామంలోని నిరుపేదలకు,అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడటంతో పాటు,తన వంతుగా వ్యక్తిగత సహాయం అందిస్తూ పెద్ద దిక్కుగా నిలుస్తున్నారు.రవీందర్ రావు ప్రత్యేకత ఏమిటంటే, ఆయన ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారు. నిరంతరం నాకు మద్దతుగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని సర్పంచ్ సుధాటి రవీందర్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.పదవికి వన్నె తెస్తూ, ప్రజా సేవలో నిరంతరం దూసుకుపోతున్న రవీందర్ అన్నకు ముత్తారం ప్రజలు జేజేలు పలుకుతున్నారు.ముత్తారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ప్రజల సేవలోనే నాకు నిజమైన తృప్తి ఉంది.

## కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో రూ. 25 వేలు చెల్లించాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికి లాభాల్లో వాటా కింద 25 వేల రూపాయలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ సి.హెచ్.పి లో జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి లో గత 20 సంవత్సరాల నుండి దాదాపు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాల్లో పని చేస్తూ బొగ్గు ఉత్పత్తి కి సహకరిస్తూ సంస్థ లాభాల్లో వీరి కృషి ఉందని ఆయన తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా సింగరేణి లో గుర్తింపు సంఘం గా గెలిచిన ఏఐటియుసి 2024 లో సంస్థ లాభాల నుంచి 5000/ రూపాయలు, 2025లో 5500/ రూపాయలు కాంట్రాక్టు కార్మికుల కు ఇప్పించడం జరిగిందని ఆయన తెలిపారు. సింగరేణి కి 2025 2026 సంవత్సరం లో ఎంతో కొంత లాభాలు వచ్చే అవకాశం ఉందని,అట్టి లాభాల్లో నుంచి కాంట్రాక్టు కార్మికుల కు 25 వేల రూపాయలు వాటా కింద ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన యాజమాన్యం ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కనీస వేతన సవరణ చైర్మన్ గా ఉన్న జనక్ ప్రసాద్ గారు ఉండి కూడా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల అమలు,వారి సంక్షేమం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, కనీస వేతనాల సవరణ చైర్మన్ గారు స్పందించి సింగరేణి లో కాంట్రాక్టు కార్మికుల కు కనీస వేతనాలను అమలు, సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల కు పని స్థలాల్లో సేఫ్టీ మెటీరియల్ ఇవ్వక పోవడం వల్ల వారు ప్రమాదాలకు గురి అవుతున్నారని ఆయన అన్నారు. కనుక యాజమాన్యం వెంటనే కాంట్రాక్టు కార్మికుల కు సేఫ్టీ మెటీరియల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టు కార్మికులు వెంకన్న, శ్రీనివాస్, మల్లికార్జున్,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్భాటాలకు దూరంగా.. ఆపన్నులకు అండగా

### వృద్ధాశ్రమంలో బట్టల పంపిణీ చేసిన కొమురవెల్లి రామ్మూర్తి కుటుంబం

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సమాజానికి ఆదర్శంగా నిలిచే సేవా కార్యక్రమాన్ని చేపడుతూ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ప్రముఖ రైస్‌మిల్ వ్యాపారవేత్త,సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కొమురవెల్లి రామ్మూర్తి – సత్తెమ్మ దంపతులు తమ మనవడు శ్రీశాంక్ పుట్టినరోజును ఆర్భాటాలకు దూరంగా,సేవా భావంతో నిర్వహించారు.ఈ సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు కొత్త బట్టలను అందజేశారు.ప్రత్యేకంగా వృద్ధులందరికీ ముందుగానే కొలతలు తీసుకుని వారికి సరిపోయే ప్యాంట్లు,షర్టు కుట్టించి అందించడం అందరి ప్రశంసలను అందుకుంది.వృద్ధాశ్రమంలోని పురుషులు,మహిళలు శ్రీశాంక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొమురవెల్లి రామ్మూర్తి – సత్తెమ్మ దంపతులతో పాటు వారి కుమారుడు,కోడలు రాజేష్ – ప్రియాంక దంపతులను, మనవళ్లు శ్రీశాంక్, శ్రేయాంక్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కొమురవెల్లి రామ్మూర్తి – సత్తెమ్మ దంపతులు మాట్లాడుతూ,పుట్టినరోజు వేడుకలను ఆర్భాటంగా జరుపుకోవడం కంటే అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం ద్వారా కలిగే ఆనందం, సంతృప్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మరింత మంది దాతలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్ – లక్ష్మి,ప్రభుత్వ వృద్ధాశ్రమం కోఆర్డినేటర్ గట్టు స్వామి,నరేష్,క్యాదర్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## కనుకుల గ్రామంలో సామూహిక వనభోజనాలు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ :పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామంలో గ్రామ ప్రజలు సామూహికంగా వనభోజనాలకు తరలి వెళ్లారు. గ్రామ సర్పంచ్ కర్రే కవిత కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామ ప్రజలు నీరుకుల్ల, మారుతి నగర్, రాముని పల్లె తదితర ప్రాంతాలకు వెళ్లి వనభోజనాలను ఆనందంగా నిర్వహించారు. ఇటీవల గ్రామానికి కీడు సోకిందని గత రెండు నెలల కాలంలో గ్రామంలో వరుస మరణాలు సంభవించడమే కాక పలువురు తరచూ అనారోగ్యాలకు గురవుతున్న నేపథ్యంలో,గ్రామంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ వనదేవతలను ప్రత్యేకంగా ప్రార్థించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కర్రే కవిత కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం గ్రామంలో కులమతాలకతీతంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి వనభోజనాల కార్యక్రమం కోసం నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు.

## బీరుపూర్ మండలంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పర్యటన

ప్రజా పక్షం/బీర్‌పూర్ : జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలంలోని గోదావరి పుష్కరాల నేపథ్యంలో బీర్పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ గ పర్యటించారు.రంగసాగర్,మంగేలా,కమ్మునూరు,చిత్రవేణిగూడెం, రేకులపల్లి గ్రామాల్లోని గోదావరి నది పుష్కర ఘాట్లను సందర్శించి అక్కడ చేపట్టనున్న ఏర్పాట్లను పరిశీలించారు.హిందువులు పవిత్రంగా భావించే పుష్కరాలకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. బీర్పూర్ మండలానికి చెందిన 20 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి సి ఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.9 లక్షల 36 వేల విలువైన చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ రాంచందర్ ఎంపిడివో భీమేష్ ఎమ్మార్వో సుజాత కే డిసిసి జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావు పాక్స్ చైర్మన్ నవీన్ రావు మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రాజగోపాల్ రావు దేవాలయ చైర్మన్ శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపాక రమేష్,మండల సర్పంచ్ లు, నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## బాక్టీరియా ఎండు తెగులు

### రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పొట్యాల,సోమనపల్లి శివారులో వరి పొలాల్లో బాక్టీరియా ఎండు తెగులు సోకినట్లు గుర్తించడంతో పొలాలను గురువారం పరిశీలించినట్లు మండల వ్యవసాయ అధికారి కె.సతీష్ కుమార్ తెలిపారు. తెగులు నివారణకై రైతులకు పలు సూచనలు చేశారు. తెగులు కనిపించిన వెంటనే యూరియా, అమ్మోనియా వంటి నత్రజని ఎరువుల వాడకం ఆపివేయాలని, పొటాష్ కలిగిన ఎరువులు వేయాలని, తెగులు సోకిన మడి నుండి ఇతర మడులకు నీరు పారకుండా చూడాలని రైతులకు చెప్పారు. స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ కలిగిన మందును 150 గ్రాముల చొప్పున ఎకరానికి కలిపి పిచికారి చేయాలన్నారు. లేదా కాసుగామైసిన్, కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిగిన మందును 300 గ్రాముల చొప్పున ఎకరానికి కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు.

## ముత్తారంలో యాదవ సంఘానికి నూతన ఉత్సాహం

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చెల్కల జితేందర్ యాదవ్ కు జిల్లా యాదవ సంఘం నాయకులు ఘనంగా సన్మానం చేశారు.గురువారం రామగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధవేని రాజేందర్ యాదవ్ లు ఆయనకు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.యువ నాయకుడు జితేందర్ యాదవ్ నాయకత్వంలో ముత్తారం మండలంలో యాదవ సంఘం మరింత బలోపేతం కావాలని,ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు.జిల్లా ఉపాధ్యక్షులు ఉడుత పర్వతాలు యాదవ్,మంథని మండల అధ్యక్షులు పర్స మోహన్ యాదవ్,గిరవేన రాములు యాదవ్, ఫకీరా యాదవ్,తిరుపతి యాదవ్,యుగేందర్ యాదవ్, కొదారి మల్లేశం యాదవ్,తదితర యాదవ సంఘం నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జితేందర్ యాదవ్ ను అభినందించారు.

## పోషకాహారంతోనే అసలైన ఆరోగ్యం

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పోషకాహారం తీసుకోవడం వల్లనే గర్భిణీలు బాలింతలు చిన్నపిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని మంచి గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మీ అన్నారు.మండలంలోని మంచిరామి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు,చిన్నారుల తల్లిదండ్రులకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషక విలువలు, సమతుల ఆహారం, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై వివరించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి,సర్పంచ్ శ్రీమతి ఉప్పు లక్ష్మి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుస్వాతి,పంచాయతీ కార్యదర్శి కె. రాజేష్ కుమార్, అంగన్వాడీ టీచర్లు,గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## క్రీడల్లో సత్తా చాటిన డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ

ప్రజాపక్షం/కొత్తపల్లి:వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటి మూడు గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు చైర్మన్ ఎన్.వెంకట్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని రేకుర్తి డ్రీమ్ డిఫెన్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎంపి ఈటలను కలిసిన ఎన్‌హెచ్‌ఎం జెఎసి నాయకులు

ప్రజాపక్షం / మానకొండూర్ :తెలంగాణలో పని చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జెఏసి నాయకులు డా.శ్రీనివాస్, డా.వెంకటేశ్, డా.కుమార్, డా.పుల్లారావు, డా.శ్రావిక, డా.వనజ తదితరులు మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌ను హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో చేసినట్లు తెలంగాణలో కూడా ఎంహెచ్‌ఎంలు, సెకండ్ ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులతో సహా అన్ని కేడర్ల ఉద్యోగులను క్రమబద్ధీకరించి జాబ్ సెక్యూరిటీ కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా పిఆర్‌సి అమలు చేయాలని, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి సమగ్ర భీమా సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లు న్యాయమైనవని పార్లమెంట్‌లో తమ గళాన్ని వినిపిస్తానని ఎంపి ఈటల రాజేందర్ హామీ ఇచ్చినట్లు జెఏసి నాయకులు తెలిపారు.

## శాశ్వత లేబర్ ఆఫీసర్‌ను నియమించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:సిరిసిల్లలో శాశ్వత లేబర్ ఆఫీసర్‌ను నియమించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. ఏఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రతిరోజు ఇసుక మొరంకు అనుమతులు కల్పించాలని కోరారు. ఏసిఎల్, డిసిఎల్‌లను నియమించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లేబర్ వెల్ఫేర్ బోర్డులోని డబ్బులను కాంట్రాక్టర్‌లకు ఒక సంవత్సరం లీజు పేరుతో లేబర్ కార్డుదారులకు మెడికల్ టెస్టుల పేరుతో కొల్లగొడుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ గడువు ముగిసినప్పటికీ కార్మిక సమస్యలు తీరలేదని పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయలేదని, అందుకే కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేసి నేరుగా లేబర్ ఆఫీసర్ల ద్వారా కార్మికులకు బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్, మ్యారేజ్‌కు ఒక లక్ష, డెలివరికి రూ.50 వేలు ఇవ్వాలని కోరారు. కార్మికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెంటనే స్థానిక కార్మికుల ఉపాధి కాపాడాలని అన్నారు. ఈ సమావేశంలో కొత్త పెల్లి చారి, అనంతం తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల క్యాన్సర్‌పై అవగాహన అత్యవసరం

చిన్నారుల్లో క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే 80 శాతం నయం చేసే అవకాశం



ప్రజాపక్షం /మానకొండూర్:చిన్నారుల్లో క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించి సరైన చికిత్స అందిస్తే దాదాపు 80 శాతం వరకు పూర్తిగా నయం చేసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ సోమాజీగూడ యశోద హాస్పిటల్స్ పీడియాట్రిక్ అంకాలజీ హెమటాలజీ క్లినికల్ డైరెక్టర్, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ డా.పరిణిత రెడ్డి గుత్తా తెలిపారు. గురువారం కరీంనగర్‌లోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా చిన్నారులకు క్యాన్సర్ చికిత్స అందిస్తున్న అనుభవం తనకు ఉందని డా.పరిణిత చెప్పారు. చిన్నారుల్లో క్యాన్సర్ పెద్దగా కనిపించని వ్యాధి అయినప్పటికీ తల్లిదండ్రులు దాని లక్షణాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో ముఖ్యమని అన్నారు. పుట్టిన నాటి నుంచి 18 సంవత్సరాల వరకు చిన్నారుల్లో వివిధ రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. పెద్దవారికి, చిన్నారులకు వచ్చే క్యాన్సర్ చికిత్స విధానాల్లో గణనీయమైన తేడా ఉంటుందని తెలిపారు. వ్యాధి స్వభావాన్ని బట్టి శస్త్ర చికిత్స, కీమోథెరపీ, రేడియోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీతోపాటు స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ వంటి ఆధునిక చికిత్సా విధానాలను ఉపయోగిస్తామని తెలిపారు. చిన్నారుల్లో నిరంతరం తగ్గని జ్వరం, అసాధారణ రక్తస్రావం, కీళ్ల నొప్పులు, రక్తహీనత, శరీరంలో గంతులు, తగ్గని వాంతులు, కొత్తగా మెల్లకన్ను రావడం, రాత్రి వేళల్లో తగ్గని తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స ప్రారంభించడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించవచ్చన్నారు. చిన్నారుల క్యాన్సర్‌పై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో సెప్టెంబర్ నెలను చిల్డ్రన్స్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్‌గా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ సోమాజీగూడ సీనియర్ మేనేజర్లు సుధీర్ రెడ్డి, హరీష్ రెడ్డి పాల్గొన్నారు.

# రైతులకు సరిపడా ఉచిత విద్యుత్ అందించాలి

టిఆర్ఎస్ అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్



ప్రజాపక్షం / రామడుగు: వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న రైతాంగానికి ఉచిత విద్యుత్ అందించకుండా కాంగ్రెస్ సర్కార్ నట్టేట ముంచిందని తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. మండలంలోని దత్తోజీపేట గ్రామంలో సరైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో సాగునీరు అందక ఎండిపోయిన వరి పొలాలను గుంజపడుగు హరిప్రసాద్‌తో పాటు టిఆర్ఎస్ నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి సాగు చేసిన వరి పంటకు సరైన సమయంలో నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతోపాటు విద్యుత్ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే గుర్తించి వారికి పంట నష్ట పరిహారం అందించాలని. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని లేనిఎడల తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్దఎత్తున ఉద్యమిస్తామని హరిప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం నాయకులు మ్యాకల తిరుపతి, మ్యాక వినోద్, శ్రీరాముల రమేశ్, చంటి శ్రీనివాస్, పుల్ల మల్లేశం, కరీంనగర్ నగర పార్టీ అధ్యక్షులు రంగరవేణి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

నగర మేయర్ కోలగాని శ్రీనివాస్

ప్రజాపక్షం/కరీంనగర్:తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, దసరా ఉత్సవాలను గతం కంటే ఎంతో గొప్పగా నిర్వహించేలా... ఘనంగా ఏర్పాట్లు చేస్తామని నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ కోలగాని శ్రీనివాస్ అధ్యక్షతన, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సమక్షంలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈ నెల 10వ తేదీ నుండి 20వ తేదీ వరకు వైభవంగా జరగనున్న బతుకమ్మ, దసరా, దేవి నవరాత్రుల, ఉత్సవాలకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ. 2.80 కోట్ల అంచనా నిధులతో విస్తృత ఏర్పాట్లు చేసేందుకు సమాయత్తమైంది. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ 66 డివిజన్ల బతుకమ్మ పాయింట్లతో పాటు నిమజ్జనం పాయింట్లు, అంబేద్కర్ స్టేడియం దసరా ఉత్సవాలకు చేయాల్సిన సివిల్ పనులు, ఎలక్ట్రికల్ పనులు, పారిశుధ్య నిర్వహణ ఇతర ఏర్పాట్ల పై డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి మేయర్ కోలగాని శ్రీనివాస్ సుదీర్ఘంగా చర్చించారు. టెండర్ల ప్రక్రియ, ఏర్పాట్లు, వసతి సౌకర్యాల పై అధికారులు సిబ్బందికి పలు సూచనలతో దిశానిర్దేశం చేస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... తెలంగాణ ఆడబిడ్డల సంస్కృతి సాంప్రదాయ పండగ బతుకమ్మ, దసరా వేడుకలను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. గతం కంటే చాలా గొప్పగా ప్రజలకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా సుమారు 2.80 కోట్ల రూ. నిధులు కేటాయించి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియలను పూర్తి చేశామని... పనుల కేటాయింపుల పై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి అధికారులు సిబ్బందికి తగిన సలహా సూచనలతో ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. డివిజన్లలో బతుకమ్మ ఆడే ప్రదేశాలు, నిమజ్జనం పాయింట్ల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నగర వ్యాప్తంగా మెరుగైన పారిశుధ్య నిర్వహణ, వీది దీపాల ఏర్పాటు, చక్కటి లైటింగ్, సౌండ్ సిస్టమ్, త్రాగు నీటి వసతి, పాయింట్ల వద్ద చదును మరమ్మతులు, నిమజ్జనం పాయింట్ల వద్ద బారికేడింగ్, అవసరమైన చోట అదనపు లైటింగ్, పారిశుధ్యం, స్టేజ్ ల ఏర్పాటు, సౌండ్ లైటింగ్, జనరేటర్లు, మహిళల భద్రత తదితర వసతులు సౌకర్యాలతో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... బతుకమ్మ, దసరా పండగ వాతావరణం ఉట్టిపడేలా తగిన ఏర్పాట్లు చేసి... మహిళలు ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ పండగ జరుపుకునేలా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమీషనర్ ఆయాజ్, డిప్యూటీకమీషనర్లు ఖాధర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, అసిస్టెంట్ కమీషనర్ రాజ మనోహార్, ఇంచార్జ్ ఈఈ లచ్చిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## విద్యార్థిపై దాడి చేసిన ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

ప్రజాపక్షం/కరీంనగర్:కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిపై ప్రిన్సిపాల్ విచక్షణారహితంగా, రాక్షసంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునావత్ శ్రీనివాస్ నాయక్, మచ్చ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ర్యాగింగ్ చేశాడనే సాకుతో విద్యార్థిని కొట్టి, ఒంటిపై వాతలు తేలేలా గాయపరిచడం అమానుషమైన చర్య అని, విద్యను బోధించి, విద్యార్థులను రక్షించాల్సిన ప్రిన్సిపాల్ ఇలా కర్కశంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. గురుకులాల్లో పేద విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందన్నారు.బాధిత విద్యార్థికి వెంటనే మెరుగైన వైద్య సహాయం అందించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన ప్రిన్సిపాల్ ను వెంటనే సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని, రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో విద్యార్థుల భద్రత, పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు.ఈ ఘటనపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం హెచ్చరించారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'బ్లాక్ డే' నిరసన

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్:భారత ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా మరో స్వాతంత్ర్య పోరాటానికి నాంది పలకాలను కరీంనగర్ కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ పిలుపునిచ్చారు. ఏఐసిసి, టిపిసిసి పిలుపుమేరకు కరీంనగర్ కార్పోరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం గాంధీరోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బ్లాక్ డే నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిజేపి ఓటు చోరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపిలపై జరిగిన లాఠీ ఛార్జ్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ ప్రసాదించిన ఓటు హక్కును కూడా దొంగిలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల కమీషన్ జ్ఞానేశ్ కుమార్ బిజేపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన లక్షలాది మంది ఓటర్లను తొలగిస్తూ బిజేపి విజయానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్య, మల్లికార్జున రాజేందర్, సర్దిల్ల ప్రసాద్, కల్లపెల్లి బాలరాజు, వరాల నర్సింగం, చాడగొండ బుచ్చిరెడ్డి, భాస్కర్ నాయక్, బోనాల శ్రీనివాస్, గంట కళ్యాణి, ఆకుల ఉదయ్, కామారెడ్డి రాంరెడ్డి, అహ్మద్ అలీ, వెన్నం రజిత రెడ్డి, కోడూరు రవీందర్ గౌడ్, అబ్దుల్ రెహమాన్ మాదాసు శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

## టిఆర్‌టిఎఫ్ మండల అధ్యక్షుడిగా సిరిపురం రవీందర్

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ బోయినపల్లి మండల శాఖ సమావేశం గురువారం సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొదురుపాకలో జరిగింది. ఈ సమావేశానికి టిఆర్‌టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ అధ్యక్షత నిర్వహించారు. అనంతరం మండల నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా మండల అధ్యక్షునిగా సిరిపురం రవీందర్, మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల సతీష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా చిలకపాటి రాజశేఖర్, మహిళా ఉపాధ్యక్షులుగా సిహెచ్ మాధవి లత, రాజశ్రీ, కౌన్సిలర్లుగా కొక్కుల మల్లీశ్వరి, యాస ప్రణయ్, లావణ్య ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, పరిశీలకులుగా రాష్ట్ర బాధ్యులు పోతుగంటి రమేశ్ వ్యవహరించారు. తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా, మండల నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## మరణించినా సజీవంగా నిలిచిన నేత్రాలు

ప్రజాపక్షం/చొప్పదండి:చొప్పదండి పట్టణానికి చెందిన బొడిగె మల్లయ్య గౌడ్ (70) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణించినా నేత్రాలు మాత్రం సజీవంగా నిలిచాయి. లయన్స్ క్లబ్ చార్టర్ సెక్రటరీ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, ముద్దం తిరుపతి గౌడ్, మార్కెటింగ్ చైర్మన్ కొల్లూరి జితేందర్ కుటుంబ సభ్యులకు నేత్ర దానంపై అవగాహన కల్పించారు. కుమారులు శ్రీనివాస్ గౌడ్, నరేందర్ గౌడ్ అంగీకారంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ గాజుల సతీష్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఈ నేత్రాలు ఇద్దరు అంధులకు చూపునిస్తాయని దుఃఖంలోనూ ముందుకు వచ్చిన బొడిగె మల్లయ్య కుటుంబ సభ్యులకు జితేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

# సర్పంచ్ రాజేందర్‌కు ప్రశంసా అవార్డు



**ప్రజాపక్షం / జైనూర్ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'టిబి ముక్త్ భారత్' కార్యక్రమంలో ఉత్తమ సేవలందించినందుకు జైనూర్ మండలంలోని పవర్‌గూడ సర్పంచ్ తొడసం రాజేందర్ బృందానికి ప్రశంసా అవార్డు లభించిందని ఎంపిడిఒ కృష్ణవేణి తెలిపారు. గురువారం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఐడిఒసి సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.హరిత, డిఎంహెచ్ఒ నాగేంద్ర చేతుల మీదుగా సర్పంచ్ రాజేందర్ బృందం ప్రశంసా పత్రం, సత్కారం అందుకుంది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమ సేవలందించినందుకు ఈ గుర్తింపు దక్కిందని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఒ భిక్షపతి గౌడ్, ఎంపిడిఒ కృష్ణవేణి పాల్గొన్నారు.

# సింగరేణి బడిలో 'సిఎం అల్పాహారం'



**ప్రజాపక్షం / మందమర్రి :** మందమర్రి సింగరేణి హైస్కూల్‌లో గురువారం పౌష్టిక అల్పాహార కార్యక్రమాన్ని ఏరియా జిఎం ఎన్.రాధాకృష్ణ ప్రారంభించి, విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఉదయాన్నే నాణ్యమైన పోషకాహారం అందించడం వల్ల పిల్లల్లో శారీరక దృఢత్వం, చదువుపై ఏకాగ్రత పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. మోడర్న్ కిచెన్ల నిర్మాణానికి సింగరేణి సిఎస్ఆర్ నిధుల నుంచి రూ.50 కోట్లు కేటాయించామని, ఇందులో మంచిర్యాల కేంద్రానికి రూ.7.5 కోట్లు అందించినట్లు తెలిపారు. హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అత్యాధునిక సాంకేతికతతో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిజిఎం అశోక్, ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెగడపల్లికి 'టిబి ముక్త్' పురస్కారం



**ప్రజాపక్షం / జైపూర్ :** జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామ పంచాయతీకి ఉత్తమ 'టిబి ముక్త్' గ్రామ పంచాయతీ అవార్డు లభించింది. గురువారం నస్పూర్ సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కా ర్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య చేతుల మీదుగా పెగడపల్లి స ర్పంచ్ రామగిరి రామన్న, పంచాయతీ కార్యదర్శి సురేందర్, ఎఎన్ఎం విజయ, ఆశా కార్యకర్త మల్లక్క ఈ అవార్డును అందుకున్నారు. క్షయ వ్యాధి నిర్మూలనకు పంచాయతీ పాలకవర్గం, వైద్య సిబ్బంది సమన్వయంతో విశేష సేవలందించినందుకు ఈ గుర్తింపు దక్కింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# కూలేందుకు సిద్ధంగా పంచాయతీ భవనం



**ప్రజాపక్షం / జైపూర్ :** పౌనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి ఏ క్షణాన కూలుతుందో తెలియని ప్రమాదకర స్థితికి చేరుకోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం సమీపంలోని పౌనూర్ గ్రామ పంచాయతీలో కార్యాలయ భవనం నిర్వహణ లేక పూర్తిగా పాడుబడింది. భవనం గోడలకు నిలువునా భారీ పగుళ్లు ఏర్పడి పెచ్చులూడుతున్నాయి. కిటికీలు, తలుపులు విరిగిపోయి దర్శనమిస్తుండగా, కింది ఫ్లోరింగ్ అంతా ధ్వంసమై గుంతలు తేలింది. భవనం పరిస్థితి రోజురోజుకూ అత్యంత అధ్వానంగా మారుతుండటంతో వివిధ ధ్రువీకరణ పత్రాలు, పనుల కోసం వచ్చే ప్రజలు, నిత్యం విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడపాల్సిన దుస్థితి నెలకొంది. తలుపులు, కిటికీలు సరిగా లేకపోవడంతో నిత్యం కోతుల గుంపులు లోపలికి స్వైరవిహారం చేస్తున్నాయి. రికార్డులను చింపివేస్తూ, విలువైన ఫైళ్లు, కార్యాలయ సామగ్రిని ధ్వం సం చేస్తున్నాయని గ్రామస్తులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రజల కీలక దస్త్రాలు భద్రంగా ఉండాల్సిన చోట ఇ లాంటి అస్తవ్యస్త పరిస్థితులు ఉండటంపై తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వీడి, తక్షణమే స్పందించి భవనానికి పటిష్టమైన మరమ్మతులు చేపట్టి రక్షణ కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# సమాచారం ఇవ్వకుండానే విద్యుత్ సరఫరా బంద్

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం

**ప్రజాపక్షం / పెంచికల్ పేట్ :** ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండల కేంద్రమైన పెంచికల్ పేట్ గ్రామపంచాయతీలో గురువారం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్తు నిలిచిపోవడంతో తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడి గుక్కెడు నీళ్ల కోసం స్థానికులు అల్లాడిపోయారు. గ్రామంలో విద్యుత్తు పనులు చేపట్టే ముందు స్థానిక గ్రామపంచాయతీకి ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ సర్పంచ్, కార్యదర్శికి మాటమాత్రమైనా చెప్పకుండా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా సరఫరా నిలిపివేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి కరెంట్ లేక ఒకవైపు ఉక్కపోత, మరోవైపు నీటి సమస్యతో జనం సతమతమయ్యారు. ప్రమాదకరమైన విద్యుత్తు పనులు జరిగే సమయంలో కనీస సమన్వయం పాటించకపోవడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని గ్రామస్తులు ప్రశ్నించారు.

బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ తీరుపై ఉన్నతాధికారులు విచారణ జ రిపి చర్యలు తీసుకోవాలని, ముందస్తు సమాచారం ఇచ్చే లా ఆదేశాలు జారీ చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

# బిఎఎస్ పాఠశాలలకు రూ.7 కోట్ల బిల్లులు పెండింగ్

**ప్రజాపక్షం / మంచిర్యాల :** బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బిఎఎస్) పథకానికి సంబంధించి మూడేళ్లుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో విద్యా సంస్థల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. మంచిర్యాల జిల్లాలో సుమారు రూ.7 కోట్ల మేర బకాయిలు పేరుకుపోవడంతో పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణ భారంగా మారింది. అప్పులు పుట్టక, చేతిలో చిల్లిగవ్వ లేక దసరా సెలవుల అనంతరం విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలు కొనసాగించి సంస్థలను నడిపించే పరిస్థితి లేదని నిర్వాహకులు తేల్చిచెబుతున్నారు. నిధులు విడుదలవుతాయన్న ఆశతో యాజమాన్యాలు ఇప్పటివరకు అప్పులు చేసి పేద విద్యార్థులకు భోజనం, వసతి కల్పిస్తూ వచ్చాయి. అయితే మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్, విద్యుత్తు ఛార్జీలు పెరగడంతో పాటు సిబ్బందికి జీతాలు చెల్లించలేక విద్యా సంస్థలు అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి. రోజువారీ భోజనం పెట్టడానికి కూడా నిధులు లేక చేతులెత్తేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పేద విద్యార్థుల చదువులు అర్ధాంతరంగా ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది. దసరా సెలవులు ముగిసేలోగా గత మూడేళ్ల బకాయిలతో పాటు ప్రస్తుత విద్యాసంవత్సరం మొదటి త్రైమాసికం బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. నిధులు రాకపోతే సెలవుల తర్వాత హాస్టళ్లు మూతపడటం ఖాయంగా కనిపిస్తోంది. విద్యార్థుల వసతి బాధ్యతను సాంఘిక సంక్షేమ శాఖే ప్రత్యామ్నాయంగా చూసుకోవాల్సి వస్తుందని యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, సంక్షేమ శాఖ మంత్రి, కలెక్టర్ తక్షణమే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# టిబి రహిత సమాజమే ధ్యేయం

## అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ప్రజాపక్షం / నస్పూర్ :** క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య పిలుపునిచ్చారు. 2030 నాటికి దేశంలో టిబిని పూర్తిగా రూపుమాపే లక్ష్యంతో గురువారం నస్పూర్ కలెక్టరేట్‌లో 'టిబి ముక్త్ భారత్ అభియాన్' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ బృందాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో ఇప్పటికే 15 పంచాయతీలను టిబి రహితంగా గుర్తించామన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 265 మంది రోగులకు ఇళ్ల వద్దకే మందులు అందిస్తున్నామని, నిక్షయ్ పోషణ యోజన కింద పౌష్టికాహారం కోసం నెలకు రూ.1000 జమ చేస్తున్నామని తెలిపారు. అధికారులు ఒక్కో బాధితుడిని దత్తత తీసుకుని పోషకాహారం అందించాలని కోరారు. అనంతరం ప్రచార గోడప్రతులను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, డిపిఒ కిషన్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, ఎంపిడిఒలు, సర్పంచులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

# రాయితీపై పురుగుమందులు

**ప్రజాపక్షం / కాసిపేట :** జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్–కపాస్ కాంతి పథకం కింద పత్తి రైతులకు గురువారం రాయితీపై రసాయన పురుగుమందులు పంపిణీ చేశారు. మండలంలోని ముత్యంపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి చాల్లా ప్రభాకర్ మాట్లాడుతూ కాసిపేట మండలంలో అధిక సాంద్రత పత్తి సాగు, క్లోజర్ స్పేసింగ్ పద్ధతుల కింద 628 ఎకరాలకు ఇప్పటికే పూర్తి రాయితీతో పత్తి విత్తనాలు అందజేశామన్నారు.

ఆ రైతులకు పంట ఎదుగుదల నియంత్రణకు అవసరమైన మొపిక్వాట్ క్లోరైడ్ (చమత్కార్), ఇతర రసాయన మందులను తాజాగా రాయితీపై పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, ఆత్మ చైర్మన్ రవుతు సత్తయ్య, ఆత్మ డైరెక్టర్ మేడ సమ్మయ్య, ఎఇఒ సాగర్, రైతులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణే ఉన్నతికి మార్గం

## లక్సెట్టిపేట సిఐ రమణమూర్తి



**ప్రజాపక్షం / లక్సెట్టిపేట :** పోలీసులు విధి నిర్వహణలో ప్రజల కోసం చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేస్తే తప్పకుండా పదోన్నతులు లభిస్తాయని లక్సెట్టిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణమూర్తి పేర్కొన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో రైటర్‌గా పనిచేస్తున్న వసంత్, హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మురళి ఎఎస్ఐలుగా పదోన్నతి పొందారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో వీరికి సీఐ రమణమూర్తి, ఎస్ఐ గోపతి సురేష్ స్టార్‌లు అమర్చి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సి బ్బంది క్రమశిక్షణ, పట్టుదలతో విధులు నిర్వర్తించి ఉన్నత స్థా నాలకు ఎదగాలని సూచించారు. ప్రజలతో పోలీసులు మమేకమై పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు సత్తయ్య, అన్వర్, హెడ్ కానిస్టేబుళ్లు సాంబయ్య, రవీందర్, సుభాష్ పాల్గొన్నారు.

# ప్రతి కూలీకీ ఉపాధి కల్పించాలి

## డిఆర్‌డిఒ దత్తారామ్



**ప్రజాపక్షం / జైనూర్ :** అర్హులైన ప్రతి కూలీకి విబిజి రాంజీ పథకం ద్వారా పనులు కల్పించాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బానోత్ దత్తారామ్ అధికారులను ఆదేశించారు. గురువారం జైనూర్ మండలంలోని భూసిమెట్ట పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఫారం పాండ్ పనులను సర్పంచ్ ఆత్రం సింధు నగేష్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నిర్దేశిత కొలతల ప్రకారం నాణ్యతతో చేపట్టాలని సూచించారు. రైతులకు, ప్రజలకు ఉపయోగపడే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎపిఒ నగేష్, ఇసి అంకుష్, టెక్నికల్ అసిస్టెంట్ రాజలింగు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

# దీప్తికి పద్మశాలి బాంధవుల ఆపన్నహస్తం



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కుమారి సిందం దీప్తికి పద్మశాలి కుల బాంధవులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అండగా నిలిచారు. కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆమెకు సమిష్టిగా సేకరించిన రూ.1,61,032 ఆర్థిక సాయాన్ని ఎల్లగౌడ్ తోట పద్మశాలి కమ్యూనిటీ హాల్లో గురువారం అందజేశారు. ఈ మొత్తాన్ని నేరుగా దీప్తి బ్యాంకు ఖాతాలో జమ చేసి, అందుకు సంబంధించిన చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి బాసటగా నిలిచిన ప్రతి ఒక్కరినీ స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిందం చంద్రయ్య, గుల్లపెల్లి ఆనంద్, నాగేశ్వర్ రావు, వాడ్నాల వెంకట నర్సయ్య, నూతి సుదర్శన్, గడదాసు మల్లయ్య, రామకృష్ణ, కొంపల్లి సుదర్శన్, బూర నర్సింహం, గోరంట్ల సజీవన్, శ్రీనివాస్, మురళి, వెంకటేశం, జానకి రాములు, శంకరయ్య, మొండయ్య, లక్ష్మ ణ్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

# నీట్ ఫలితాల్లో మెరిసిన చోలే నరేష్



**ప్రజాపక్షం / జైనూర్ :** జైనూర్ మండల కేంద్రంలోని ఉస్మాన్స్ కేరళ గ్రామర్ పాఠశాల (ఒకెజిఎస్) పూర్వ విద్యార్థి చోలే నరేష్ జాతీయ స్థాయి నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంబిబిఎస్ సీటు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం గురువారం ఆయనతో పాటు తండ్రి చోలే మహాదేవ్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించింది. పాఠశాల కరస్పాండెంట్ షేక్ జమీల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన తమ పూర్వ విద్యార్థి వైద్య విద్యకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో వైద్యుడిగా ప్రజలకు ఉత్తమ సేవలందించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకం

### మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల : చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో కీలకమైనవని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి అన్నారు. గురువారం స్థానిక కల్యాణ లక్ష్మీ గార్డెన్‌లో జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం2026 ముంగిపు వేడుకలలో భాగంగా మన అంగన్‌వాడీ మన బాధ్యత కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు సక్రమంగా అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కమిటీకి సూచించారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ రాజు, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, కౌన్సిలర్ సభ్యులు భాగ్యలక్ష్మీ దేవరాజ్, రిక్కుమల్ల రజిత సంపత్, ఆకుల స్వప్న కృష్ణ, సిడిపివోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

## జూమ్ బరాబర్ ఫ్లాష్ మాబ్

ప్రజాపక్షం / కొత్తపల్లి : కరీంనగర్ జ్యోతినగర్‌లోని ఎక్స్‌ప్లోరికా ప్రీమియం పాఠశాలలో బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా జూమ్ బరాబర్ పేరుతో ఫ్లాష్ మాబ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం సంగీతం, నృత్యం, పండుగ ఉత్సాహంతో సందడిగా సాగింది. విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొని ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు చేశారు. బతుకమ్మ దసరా పండుగల విశిష్టతను ప్రతిబింబించేలా సాగిన ఈ ప్రదర్శనలు పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి, విద్యార్థుల నృత్యాలకు తల్లిదండ్రులు సైతం ఉత్సాహంగా స్పందించి వారితో కలిసి నృత్యం చేయడంతో కార్యక్రమం మరింత సందడిగా మారింది. కార్యక్రమానికి డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, రష్మిత ప్రసాద్, రాకేశ్ ప్రసాద్, ప్రసాద్, ప్రాచి వినోద్‌రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శర్మిష్ఠ, సమన్వయకర్త ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నిరాహార దీక్ష

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : ఇసి విధానాలపై నిరసనగా శాంతియుతంగా ధర్నా చేస్తున్న రాహుల్, ప్రియాంక గాంధీలపై పోలీసులచే దాడి చేయించిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముకరాంపురలోని తన కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్, ప్రియాంక చీఫ్ ఎలక్షన్ కమిషన్ జ్ఞానేశ్ కుమార్ చేసిన తప్పిదాలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే బిజెపి ప్రభుత్వం పోలీసులచే దాడి చేపించి అరెస్టులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాజ్, కార్పొరేటర్లు నర్సింగం, మల్లేశం, జగన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నిహాల్ అహ్మద్, చాంద్, భాస్కర్, లాయక్, షబానా, మహ్మద్, పోచయ్య, ముల్కల కవిత పాల్గొన్నారు.

## 'సుమిత్ర శ్రీ' ఒకేషనల్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



ప్రజా పక్షం/వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని సుమిత్ర శ్రీ ఒకేషనల్ కాలేజ్ – శివాని పారా మెడికల్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను కళాశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా పేర్చారు. సంప్రదాయ దుస్తుల్లో హాజరైన విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, కోలాటాలు, నృత్యాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మడ్డి స్వప్న మాట్లాడుతూ, విద్యార్థుల్లో చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచేందుకే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో ముడిపడి ఉందని, విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు పెంపొందించే కార్యక్రమాలను నిరంతరం ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. నిత్యం తరగతులతో బిజీగా ఉండే విద్యార్థులకు ఈ వేడుకలు ఎంతగానో ఆహ్లాదాన్ని పంచాయి. పాటలు, చప్పట్లు, కోలాటాల సందడితో కళాశాల ప్రాంగణం పల్లె వాతావరణాన్ని తలపించింది. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకోవడంతో కళాశాలలో పండుగ శోభ సంతరించుకుంది.

## మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి వస్త్రాలు పంపిణీ

### బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన 23వ వార్డు కౌన్సిలర్ బోనాల సాగరిక



ప్రజా పక్షం/వేములవాడ టౌన్: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వేములవాడ పట్టణంలోని 23వ వార్డు పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి వార్డు కౌన్సిలర్ బోనాల సాగరిక శివ గురువారం వస్త్రాలు పంపిణీ చేశారు. వార్డులోని మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలను, పురుష కార్మికులకు నూతన వస్త్రాలు కొనుగోలు కోసం నగదును అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. వార్డును పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య సిబ్బంది పాత్ర అభినందనీయమని కొనియాడారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న ఏ చిన్న సమస్యలైనా వెంటనే దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో దసరా, బతుకమ్మ పండుగలను ఘనంగా జరుపుకోవాలని ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. పండుగ వేళ తమను గుర్తించి ఆదుకున్నందుకు కౌన్సిలర్ బోనాల సాగరిక శివకు పారిశుద్ధ్య సిబ్బంది, వార్డు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## 'ఎఆర్ఎస్' కళాశాలలో బతుకమ్మ సంబరాలు



ప్రజాపక్షం / జన్నారం : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గురువారం స్థానిక ఎఆర్ఎస్ కళాశాలలో ముందస్తు సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ పాటలు, కోలాటాలతో సందడి వాతావరణం నెలకొంది. సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ముత్యం సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోతారంలో 'భూ భారతి - రీ సర్వే' అవగాహన సదస్సు



ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పోతారం గ్రామంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భూ భారతి రీ సర్వే' కార్యక్రమంపై రైతులకు,గ్రామస్థులకు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తాహసీల్దార్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రతి భూమి హద్దులను కచ్చితంగా నిర్ధారించి,శాశ్వత భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ సమగ్ర రీ సర్వేను చేపట్టిందని తెలిపారు. గతంలో జరిగిన భూముల కొనుగోళ్లు, అమ్మకాలు,వారసత్వ బదలాయింపుల వల్ల క్షేత్రస్థాయి మ్యాప్‌లలో వచ్చిన తేడాలను ఈ సర్వే ద్వారా పూర్తిగా సరిదిద్దుతామని వివరించారు.21 రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణసర్వే ప్రక్రియ పూర్తయిన తర్వాత గ్రామాల్లో భూ వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ వివరాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటి స్వీకరణకు 21 రోజుల పాటు గడువు ఇస్తామని చెప్పారు.అనంతరం తుది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రైతులకు కొత్తగా 'భూధార్' కార్డులను జారీ చేస్తామని స్పష్టం చేశారు.సర్వే జరుగుతున్న సమయంలో రైతులందరూ తమ భూముల వద్ద అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉట్ల చరణ్, తహసీల్దార్, ఆర్ఐ నరీన్ సాయి కార్యాలయ రెవెన్యూ అధికారులు,సర్వే సిబ్బంది,గ్రామస్తులు,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల సుభాష్‌నగర్ సిపిఐ కార్మిక భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఒకవైపు బిజెపి అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాల వల్ల రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ ఇంఛార్జి గుంటి వేణు, నాయకులు సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్ పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి ఎక్కడ?

### కార్పొరేటర్ వనపర్తి కేత



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : ఎమ్మెల్యేగా గెలిచిన మూడేళ్ల కాలంలో శ్రీరాంపూర్ ప్రాంత అభివృద్ధిని స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విస్మరించారని 6వ డివిజన్ కార్పొరేటర్ వనపర్తి కేత మండిపడ్డారు. గురువారం జరిగిన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఆమె ఈ అంశాన్ని లేవనెత్తారు. ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు ప్రయత్నిస్తే కనీసం మైక్ కూడా ఇవ్వకుండా మాట్లాడే హక్కును కాలరాశారని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక కార్పొరేటర్‌కు సమాచారం లేకుండా పట్టాలు, అభివృద్ధి పనుల ప్రొసీడింగ్లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తూ ప్రజాప్రతినిధుల పాత్రను అణచివేస్తున్నారని ఆరోపించారు. డివిజన్ సమస్యల పరిష్కారానికి, సమగ్ర అభివృద్ధి కోసం ఎంతవరకైనా పోరాడతానని వనపర్తి కేత స్పష్టం చేశారు.

## గిరిజనుల చెంతకే ఉచిత వైద్యం



ప్రజాపక్షం / జన్నారం : మండలంలోని రాయికుంట, కొత్తపేట గిరిజన గ్రామాల్లో గురువారం పిఎం జన్ మాన్ సంచార వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఆదిత్య బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిజనులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపం వల్ల వచ్చే సమస్యలను వివరిస్తూ సరైన ఆహార నియమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు, ఎఎన్ఎంలు ప్రియాంక, సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## కవ్వాల్‌లో ఘనంగా 'పోషణ మాసం'



ప్రజాపక్షం / జన్నారం : మండలంలోని కవ్వాల్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలు, ఎమ్మెల్యే ఎస్‌సి కమిటీ సభ్యులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ లకావత్ సక్రూ నాయక్ మాట్లాడుతూ సమతుల్య పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం హాజరైన వారందరితో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.వాణి, ఉపాధ్యాయులు బిక్కు, గోవింద్, అంగన్‌వాడీ టీచర్లు చంద్రలీల, రజిత, జిజియా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుపేదకు ఆర్థిక సాయం

ప్రజాపక్షం /ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలం చీకోడ్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కాంపెల్లి నర్సయ్య కొన్ని సంవత్సరాల నుండి గ్రామంలో తాగునీరు ట్యాంక్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు, ఆతనికి నలుగురు కూతుర్లు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ ఆర్థిక సాయం కింద 50 వేల రూపాయల చెక్కును మంజూరు చేశారు.గురువారం ముస్తాబాద్ తహసీల్దార్ ఫారూక్ తమ కార్యాలయంలో 50 వేల రూపాయల చెక్కును గ్రామ సర్పంచ్ బొమ్మేన ఆంజనేయులు ఆధ్వర్యంలో నర్సయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రంజిత్ వార్డు సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.